క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పలు ఎరువుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో స్టాక్ వివరాలు, బిల్లుల పుస్తకాలు, గొడౌన్ నిల్వలను తనిఖీ చేశారు. తాడేపల్లి గూడేంకు చెందిన వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, జిల్లా విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువుల దుఖాణాల్లో కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు కచ్చితంగా రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన తరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరితో పాటు జిల్లా నాణ్యతా నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, వ్యవసాయాధికారి జి.రంగారావు ఉన్నారు.

కమనీయం జగన్నాథుని నేత్రోత్సవం

కవిటి: ఆషాఢమాసం తొలిరోజు శనివారం సందర్భంగా కవిటి జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారి నేత్రోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గడచిన 15 రోజులుగా నేత్రాల్ని మూసివేసిన తర్వాత నేత్రోత్సవం పేరిట కళ్లకు కట్టువిప్పి ప్రత్యేక పూజలు జరిపించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలోపూజల్లో పాల్గొన్నారు.

కౌలు కార్డులతో ప్రయోజనాలు

ఇచ్ఛాపురం రూరల్: కౌలు రైతులకు వ్యవసాయ శాఖ అందించే గుర్తింపు కార్డులతో బహు ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ సహాయకురాలు సోనియా అన్నారు. శనివారం తులసిగాం గ్రామ పంచాయతీలో కౌలు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

సంతబొమ్మాళి: మరువాడ పంచాయతీ ఎం.మరువాడ గ్రామంలో స్థానిక సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి చేతులు మీదుగా శనివారం ప్రభుత్వం అందించిన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పాఠశాల విద్యాకమిటి ఛైర్మన్ సూరాడ దాసురాజు, మాజీ వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు, రేషన్ డీలర్ బోడిపిల్లి లక్ష్మణరావు ఉన్నారు.

'స్టాప్ డయేరియా'లో భాగస్వాములు కావాలి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, వీవోఏలు భాగస్వాములు కావాలని సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులు అతిసారం భారిన పడకుండా వారికి ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందజేయాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పార్వతమ్మ, సీసీ మోహనరావు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

9న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న జేకేసీ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్టణానికి చెందిన అరబిందో, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ కంపెనీలు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డిగ్రీ బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థులకు అరబిందో ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన 17 నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులకు ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7013365031, 9640628406 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ గోవిందమ్మ ప్రకటించారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

కవిటి: హైదరాబాద్‌లో పనిచేస్తున్న ప్రవాసాంధ్రుడు పూడి ప్రసాదరావు, సూర్యనారాయణ సోదరులు కవిటిలో నిర్మాణంలో ఉన్న రెండు ఆలయాలకు ఆర్థిక సాయం చేశారు. వేంకటేశ్వర ఆలయానికి రూ. 11,100, జగన్నాథ ఆలయానికి 5,100 రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. స్థానిక నాయకలు ఎం.సీతారాం, పాపయ్యరెడ్డి, శేఖర్ వెంటకరావు ఉన్నారు.

రోటరీ అధ్యక్షులుగా రాజ్‌కుమార్

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షులుగా మాచర్ల రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఆర్‌జే ఫంక్షన్ హాల్లో శనివారం రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథ్ అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ జరిగింది. కార్యక్రమంలో జేసీఐ మాజీ అధ్యక్షురాలు రజిత, అసిస్టెంట్ గవర్నర్ రజినీకాంత్ పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

- సివిల్ జడ్జి తేజ చక్రవర్తి



టెక్కలి: మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు వలన సంభవించే ప్రమాదాలపై స్థానిక కోర్టు ఆవరణలో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటారు వాహనాల చట్టంలో నూతనంగా పొందుపరచిన నిబంధనల ప్రకారం తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని.. లేని పక్షంలో కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.రూపావతి, పి.వెంకటరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

కాశీబుగ్గ: జిల్లా లీగల్ సెల్ అథారిటీ వారి ఆదేశాల మేరకు పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పలాస మండల న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. పలాస ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు, వాహనదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణం ఎంతో విలువైనదన్నారు. హెల్మెట్ ధరించడం వలన చాలా వరకు ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చునన్నారు. డ్రైవర్లు, వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, కోత రజనికుమార్, జి.ప్రభాకర్, శ్యామ్, రవి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎస్‌వీ సంతోష్‌కుమార్, ఏఎస్పైు ప్రకాష్, కోర్ట్ కానిస్టేబుళ్ల నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ చట్టాలపై అవగాహన ఉండాలి

సోంపేట: రాష్ట్రంలో అమలవుతున్న ట్రాఫిక్ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోర్టుల సముదాయంలోసిబ్బంది, న్యాయవాదులు, ప్రజలతో వాహన చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి జె.రాము, న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్ పి.పరేష్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్, గ్రామ సచివాలయం సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టాలు, ఉద్యోగ భద్రత, మహిళా చట్టాలు, మోటార్ వెహికల్ చట్టాలు, ట్రాఫిక్ రూల్స్, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కల్పించారు. యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, యువ న్యాయవాది ఎం.రాంబాబు మాట్లాడుతూ.. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ చట్టాన్ని భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), అదే విధంగా ఎవిడెన్స్ యాక్ట్‌ను భారతీయ సాక్ష్యాధినియమం చట్టాలుగా మార్పులు చేశారన్నారు. ఇచ్ఛాపురం సీఐ ఇమ్మాన్యూల్ రాజ్, ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి, ఐసీడీఎస్ సీడీపీఓ పురాణం నాగరాణి, న్యాయవాదులు రమణయ్యరెడ్డి, దేవరాజ్‌రెడ్డి, డి.కృష్ణమూర్తి, ఎస్ఎల్ నారాయణ, మనోజ్, రంగారావు, బైరాగి, లక్ష్మీనారాయణ, భగవాన్‌దాసు ఉన్నారు.



కాశీబుగ్గ: అవగాహన కల్పిస్తున్న జడ్జి మాధురి



సోంపేట: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న జడ్జి పరేష్‌కుమార్

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



కాశీబుగ్గ: జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్‌ఛైర్మన్ సురేష్‌బాబు, దళిత సంఘాల నాయకులు

కాశీబుగ్గ: అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సంత మైదానంలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకుడు మీల జోగారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ వజ్జ బాబూరావు, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, డొక్కరి శంకరరావు, సప్ప నవీన్, సరవ రాంబాబు, నరసింహులు, రంగారావు, సప్ప మన్మథరావు, పైల చక్రధర్, టంకాల రవి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఎంఈవోలు శ్రీనివాసరావు, సత్యం, ఉర్నాన అప్పలరాజు, బెల్లాల శ్రీనివాసరావు, తెప్పల పాపారావు, తెంబూరు మధుసూదనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన కృషీవలుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని ఎం.తోటూరు ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి సుహాశ్ చంద్ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.జగ్జీవన్ రామ్ చిత్రపటం ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు జ్యోతులతో ఘనంగా నివాళులు అర్పించారు.

'ఓంకార్ మృతి తీరనిలోటు'



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు కిశోర్

కాశీబుగ్గ: సామాజికవేత్త, ఉపాధ్యాయుడు బత్తిన ఓంకార్ మాస్టార్ మృతి తమ సంఘానికి తీరనిలోటని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్, పలాస మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. మాస్టార్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పలాస మండలం పద్మనాభపురం కాలనీలోని పాఠశాలలో ఓంకార్‌తోపాటు మరో ఉపాధ్యాయుడు బూరెల జగ్గారావు సంతాప సభను శనివారం నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు సేవలను గుర్తు చేసుకున్నారు.యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, లఖినాన వెంకటాచలం, కంచరాన రమేష్, లఖినాన ఢిల్లీశ్వరరావు, ఇ.సిద్ధేశ్వరరావు, గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, దుమ్ము శంకరరావు, బమ్మిడి ఆనందరావు, దువ్వాడ జనార్ధన, తెప్పల అజయ్ కుమార్, గున్న మధుసూదనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, గున్న రమేష్, కంచరాన జయరాం పాల్గొన్నారు.

పలాసకు చేరిన వంశధార'



మోదుగులపుట్టి వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న నాయకులు, రైతులు

పలాస: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులకు ఈ ఏడాది ముందుగా వంశధార ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందివ్వడానికి అధికారులు చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. శనివారం పలాస మండలం మోదుగులపుట్టి వద్దకు వంశధార నీరు చేరింది. గంగమ్మ పరవళ్లు తొక్కుతూ రావడంతో అక్కడ రైతులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. రైతులతో పాటు టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు, హేమబాబు చౌదరి, బడ్డ నాగరాజు, అవుగాన షణ్ముఖరావుతో పాటు వంశధార ఈఈ బి.రాజశేఖర్‌బాబు, ఏఈ రాజశేఖర్ తదితరులు సంతోషం వ్యక్తం చేస్తూ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ శేఖర్ బాబు మాట్లాడుతూ.. పలాస వరకు మొదటిగా నీరు ఇవ్వడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. తాను గతంలో ఇక్కడ పనిచేశానని, గతంలో ఎప్పుడు కూడా ఈ విధంగా ముందుగా నీరు రాలేదన్నారు. గత నెలలో ఎమ్మెల్యే గౌతు శిరీష, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తదితరులు తమతో కలిసి వంశధార కాలువను పరిశీలించారన్నారు. వారి కోరిక మేరకు తాత్కాలికంగా ముందుగా కాలువలో పూడిక తీత పనులను చేపట్టామన్నారు. ఇటీవల జెడ్పీ సమావేశం సందర్భంగా కూడా శివారు భూములకు ముందుగా నీరు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడంతో ఆ విధంగా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. వీరఘట్టం వద్ద గల వంశధార బ్యారేజీ నుంచి ఈ నెల ఒకటో తేదీన 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. టెక్కలి మండలం వచ్చేసరికి 550 క్యూసెక్కులు చేరిందన్నారు. టెక్కలిలో 25 లిఫ్టుఇరిగేషన్లు ఉన్నాయని, వాటికి నీరు ఇవ్వకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పలాస మండలం మోదుగులపుట్టి వద్దకు శనివారం ఉదయానికి 400 క్యూసెక్కులు వచ్చి పడిందన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నీరు విడుదల చేశామని, శనివారం సాయంత్రానికి నారాయణపురం వద్దకు అన్ని చెరువులను నింపుతూ నీరు చేరిందన్నారు. కాశీబుగ్గ జగన్నాథసాగర చెరువులోకి మరో రెండు రోజుల్లో నీరు పూర్తిగా చేరుతోందన్నారు. ఆ తర్వాత వజ్రపుకొత్తూరు మండలంలో కిడిసింగి వరకు కూడా ఈ నీరు వెళ్తుందని చెప్పారు. ఈ ఏడాది ఒడిశా భూభాగంలో ఎక్కువగా వర్షాలు రావడం వల్ల మనకు వర్షాలు తక్కువగా ఉన్నా ఈ నీరు వచ్చిందన్నారు. మరో రెండు రోజుల్లో వర్షాలు పడితే ఈ ప్రాంత ప్రజలకు సాగు నీటి సమస్య ఉండదన్నారు. వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు మాట్లాడుతూ.. సాగునీరు రావడానికి ప్రయత్నం చేసిన ఎమ్మెల్యే శిరీషకు, మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వంశధార ఈఈ శేఖర్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తమ్మినాన గంగారావు, కుత్తుం లక్ష్మణరావు, సూరాడ మోహనరావు, బుల్లోజు శశిభూషణరావు, సార జోగారావు, సప్ప నవీన్, డాక్టరు వి.దుర్గారావు, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా బొడ్డపాడు, మామిడిపల్లి, మర్రిపాడు, నీలావతి, మాకన్నపల్లి, గురుదాసుపురం, మామిడిమెట్టు, కొబ్బరిఊరు గ్రామాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రథయాత్రను జయప్రదం చేయండి

వజ్రపుకొత్తూరు: అనంతగిరి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కమిటీ సభ్యులంతా రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. 300 ఏళ్ల చరిత్ర కలిగిన స్థానిక శివాలయం ఆవరణలోని జగన్నథస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై ఈ నెల 15వ తేదీన మారు యాత్రతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

'యూరియా లెక్కలు తేల్చండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై సరఫరా చేసిన 20 టన్నుల యూరియాకు సంబంధించి లెక్కలు తేల్చాలని ఎమ్మెల్యే బి.అశోక్ సోంపేట సబ్ డివిజన్ ఏడీఏ కె.జగన్మోహనరావును ఆదేశించారు. మండలంలోని రామయ్యపుట్టుగలో తన కార్యాలయంలో వ్యవసాయశాఖపై సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల పంపిణీకి సంబంధించి అన్ని మండలాల వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని సూచించారు.

సమయపాలన పాటించాలి

ఇచ్ఛాపురం: విద్యార్థులు సమయ పాలన పాటించాలని మోటివేటర్ రజిత అన్నారు. స్థానిక జ్ఞాన భారతి సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు రేపు

కాశీబుగ్గ: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్టు పలాస మండల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు, వైఎస్సార్‌కు నివాళులర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

కోటబొమ్మాళి: పాముకాటుకు గురైన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోయింది. మండలంలోని చిన్న హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన చింతాడ రమేష్, వరలక్ష్మిల కుమార్తె ఝాన్సీ (15) గ్రామంలోని హైస్కూల్‌లో పదో తరగతి చదువుతుంది. గత నెల 27వ తేదీన ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో కాలుపై పాము కాటువేసింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి



కోటబొమ్మాళి: కుక్కలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

- పశుసంవర్ధక శాఖ ఏడీ రఘునాథరావు



కాశీబుగ్గ: శునకాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు



టెక్కలి: కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్న ఏడీ రఘునాథరావు



కంచిలి:కుక్కకు ఇంజక్షన్ వేస్తున్న డాక్టర్ శిరీష

టెక్కలి: పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు వ్యాపించకుండా వాటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ జి.రఘునాథరావు సూచించారు. పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. జునోసిస్ దినోత్సవం సందర్భంగా టెక్కలి చిన్నబజారులోని పశు వైద్య కేంద్రంలో శనివారం పెంపు జంతువుల యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు జంతువులైన కుక్క, పిల్లి తదితరవి కాటు వేస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వెంకటరమణ, విజయకుమారి, రామకృష్ణ, ద్రోణాచార్య, కృష్ణమూర్తి ఉన్నారు.

కంచిలి: మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కంచిలి మండల పశువైద్యశాల వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో 15 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ టి.శిరీష ఆధ్వర్యంలో చేపట్టారు. పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో 52 పెంపుడు కుక్కలకు సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. వెటర్నరీ ఏడీ మంద లోకనాథం, కురుడు పశు వైద్య కేంద్రం వైద్యుడు లఖినేని కిరణ్ కుమార్, స్థానిక టీడీపీ నాయకులు బోయిన గోవిందరాజులు, బి.రమేష్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస ఏరియా పశువైద్యశాల ప్రాంగణంలో ఉచిత యాంటీ రేబీస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. పలాస ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో 86 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. జూనోసిస్ వ్యాధి గురించి పెంపుడు జంతువులు యజమానులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సహాయంతో వీధి కుక్కలన్నింటికీ టీకాలు వేయాలని, ప్రజలు రేబిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ, నాయకులు డొక్కరి శంకరరావు, పీరుకట్ల విట్టల్, గాలి కృష్ణారావు, డాక్టర్లు మధుబాబు, భానుమతి, శ్రీదేవి, పారాస్టాఫ్ ఎల్ఎస్ఏ కళ్యాణ్, బోర అశోక్ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవ్వండి



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: గ్రామ పంచాయతీల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మనతోనే ఉన్నారని, వారికి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తు చేశారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్‌లు శిలగాన భాస్కరరావు, తామాడ పద్మావతి, పొందూరు గున్నయ్య, హరీష్, ఖగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాడుగు కామేష్ ధర్మారావు, బుద్దాన శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న నాయకులు

కవిటి: ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు సాయం చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 50 మంది బాలబాలికలకు యూనిఫారాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. దాతల నుంచి రూ.25 వేలు సేకరించి వీటిని కొనుగోలు చేసి అందించినట్టు మండల కోఆప్షన్ సభ్యుడు పి.ఖర్ తెలిపారు. నేతలు ఆరంగి మధు, బి.కామరాజు, బి.తిరుమల, ఆరంగి రాజు, బి.విశ్వనాథం పాల్గొన్నారు.

కవిటిలో గ్రామ సభ



మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

కవిటి: గత ఏడాది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల్ని పారదర్శకంగా తెలియజేయడమే స్టాట్యూటరీ గ్రామసభ లక్ష్యమని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈ మేరకు శనివారం గ్రామసభ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 24.5 లక్షల నిధులు వెచ్చించినట్టు ఈవో జీవీ స్వామి ప్రకటించారు. సమావేశంలో పి.నీలాచలం, పి.శేఖర్, టీడీపీ నాయకులు బి.రమేష్, బెందాళం కామరాజు, ఎ.మధు, బి.తిరుమలరావు, ఆరంగి రాజు ఉన్నారు.

పూడికతీత పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఈ శ్రీకాంత్

సంతబొమ్మాళి: మర్రిపాడులో జరుగుతున్న 16–ఆర్ వంశధార చానల్ పూడికతీత పనులను సంబంధిత డీఈ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరి ఆయకట్టు వరకు నీరందేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని అన్నారు. వంశధార జేఈ భాస్కరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ ఉన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

ఇచ్ఛాపురం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ. మూడు లక్షల వ్యయంతో మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం వద్ద నిర్మించిన బస్ షెల్టర్‌ను శనివారం ప్రారంభించారు. రోటరీక్లబ్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథ్, అసిస్టెంట్ గవర్నర్ రజనీకాంత్, రోటేరియన్లు తులసీదాస్, రామారావు, వి.సురేష్, దినేశ్, నవీన్, వేదవ్యాస్, ఐ.సి.రావు, షణ్ముఖ, చౌదరి పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ రోగికి మగ బిడ్డ ప్రసవం

- తల్లీబిడ్డ సురక్షితం



మహిళను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక మహిళ సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది. కేజీహెచ్‌లో పలు విభాగాల వైద్యులు సమన్వయంతో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించారు. తల్లి, బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన 24 ఏళ్ల అరుణకుమారి అనే యువతి రెండో గర్భం దాల్చింది. ఏడో నెలలో రక్త పరీక్షలు చేయగా తీవ్రమైన బ్లడ్ క్యాన్సర్ అని శ్రీకాకుళంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. వెంటనే కేజీహెచ్‌కు ఈ కేసును రిఫర్ చేశారు. కేజీహెచ్‌లోని మెడికల్ అంకాలజీ విభాగంలోని క్యాన్సర్ వైద్య నిపుణులు అరుణకుమారికి సకాలంలో వైద్య సేవలు అందించామని కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందించారు. అరుణకుమారి అనీమియా(రక్తహీనత), తక్కువ ప్లేట్‌లెట్స్ ఉండడంతో పలువురు వైద్యులు సేవలు అందించారు. 9వ నెలలో అరుణకుమారి ప్రసూతి వైద్యులు సిజేరియన్ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇటువంటి రక్తకణాల క్యాన్సర్‌లో తల్లి, బిడ్డ సురక్షితంగా కోలుకోవడం చాలా అరుదైన సంఘటన అని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. శనివారం తల్లి, బిడ్డను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని అభినందించారు. అరుణకుమారి వైద్యం కోసం గైనకాలజిస్టు డాక్టర్ సోమని,డాక్టర్ రవీంద్ర,డాక్టర్ షర్మిల,నర్సింగ్ సిబ్బంది తదితరులు ఎంతో సహకారం అందించారని కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్పా తెలిపారు.